# గురుదక్షిణ

**హౌ**రా స్టేషను. 9వ నంబరు ప్లాట్‌ఫాం. ఉదయం తొమ్మిది గంటలు అయింది. తొమ్మిది ఇరవైకి బయలుదేరవలసిన డీలక్స్ ఇంకా ప్లాట్‌ఫామ్ మీదికి రాలేదు.

వేసవికాలం విపరీతమైన రద్దీగా వుంది. రెండుకాళ్ళమీద నిలబడే స్థలంలేక ఒంటికాలిమీద కొంగలా నిలబడి వున్నారు జనం. ఆ రద్దీలోనే అపర అభిమన్యుడిలా దూరిపోయి చేతులు చాపుతున్నారు ముష్టివాళ్ళు. వీపుమీదా చేతుల్లోనూ తాము అమ్మే సామాన్లు పట్టుకున్న వ్యాపారులు ఆ ఇరుకులోనే చొచ్చుకుపోతున్నారు.

ఓ పక్క సామాన్లు చూసుకుంటూ, ఈగల్లా ముసిరి గోల చేస్తున్న వీళ్ళబారినుండి తప్పించుకుంటూ, ధారాపాతంగా కారిపోతున్న చెమటలు తుడుచుకుంటూ నానాయాతన పడుతున్నారు ప్రయాణీకులు.

ఎయిర్‌బ్యాగ్ భుజాన తగిలించుకొని ముష్టివాళ్ళనీ వ్యాపారులనీ తోలుకుంటూ వున్న ముకుందం దగ్గరికి వచ్చాడో యువకుడు.

“సాబ్ అగర్‌బత్తీ లీజియే” అంటూ అగరుబత్తీ పొట్లాలు మొహం మీద వూపాడు.

వద్దని సైగచేసి తలతిప్పుకున్నాడు ముకుందం.

“లీజియే సాబ్. అచ్ఛా అగర్‌బత్తీ దోరూపయా కో ఏక్” అన్నాడు.

“నహీ చాహియే జావ్” విసుక్కున్నాడు ముకుందం.

కాని అతను వెళ్ళలేదు. జిడ్డులా పట్టుకున్నాడు. ఆ గోల భరించలేక చేతిలోని పేపరు తీసుకుని మొహానికి అడ్డుపెట్టుకున్నాడు.

దాంతో హఠాత్తుగా ముకుందం కాళ్ళమీద పడిపోయాడు. "గరీబ్‌కో సహాయతా కరో సాబ్. దోపేకెట్ లో సాబ్" అన్నాడు దీనంగా.

చిర్రెత్తుకొచ్చింది ముకుందానికి. వంగి భుజం పట్టుకుని లేపాడు.

"ఏ కైసా జబర్దస్తీ హై? ఏక్‌బార్ బోలా తొ సమఝ్ లేనా చాహియే" చివాట్లు పెడుతూ హఠాత్తుగా ఆగిపోయాడు.

ఎదుటి వ్యక్తిమొహం ఎక్కడో చూసినట్లు వుంది. ఎవరూ? తేరిపార చూశాడు. హఠాత్తుగా గుర్తువచ్చింది.

"అరె నువ్వు సుబ్రహ్మణ్యంవి కదూ!" అన్నాడు సంభ్రమాశ్చర్యాలతో.

ఆ వ్యక్తి మొహంలో రంగులు మారాయి. "నిన్నే నువ్వు రామయ్య మాష్టారి అబ్బాయివి కదూ! నేను ముకుందాన్ని గుర్తుపట్టలేదూ?" మళ్ళీ రెట్టించాడు ముకుందం.

చివాల్న అతని చెయ్యి విదుల్చుకుని వేగంగా వెళ్ళసాగాడు అతను. నాలుగు అంగల్లో వెంటబడి అతన్ని దొరక పుచ్చుకున్నాడు ముకుందం.

"అలా పారిపోతావేం?" అడిగాడు.

అంతలో రైలు ప్లాట్‌ఫాం మీదికి వస్తూ వుండడంతో అంతా అల్లకల్లోలంగా తయారైంది. ఆ హడావిడిలో జారుకోవాలని అతనూ వదలకుండా పట్టుకోవాలని ముకుందం శాయశక్తులూ వినియోగించారు. గెలుపు ముకుందందే అయింది. అతని చెయ్యి దొరకపుచ్చుకొని బరబర లాక్కుపోయి ఖాళీ బెంచిమీద కూలేశాడు. పారిపోకుండా చేత్తోపట్టుకుని అలుపు తీర్చుకుని అపుడు అడిగాడు.

అడుగుతుంటే సమాధానం చెప్పకుండా వెళ్ళిపోతావేం? అంత గొప్పవాడివై పోయావా?

"గొప్పతనం నాకెక్కడినుంచి వస్తుందండీ? మీరు ఆయన పేరెత్తేసరికి కంపరం భరించలేక నా దారిన నేను పోబోయాను. అదీ తప్పేనా? ఆయన కొడుకునని చెప్పుకోడం నాకెంత మాత్రం ఇష్టం లేదు" అన్నాడు సుబ్రహ్మణ్యం ధుమధుమ లాడుతూ.

లాగి లెంపకాయ కొట్టబోయి పబ్లిక్ ప్లేస్ కాబట్టి తమాయించుకున్నాడు ముకుందం. మరోమాట మాట్లాడావంటే పళ్ళు రాలగొడతాను. ఆ మహాత్ముణ్ని ఏమన్నా అంటే పుట్టగతులుంటాయా నీకు? ఎంతమందికి మహోపకారం చేసి వారి జీవితాలను

నిలబెట్టిన మహానుభావుడాయన. ఆయన కొడుకుగా పుట్టడం నువ్వు చేసుకున్న అదృష్టం అన్నాడు ఆగ్రహంగా.

"అవును మరి. ఆయనకు కొడుకుగా పుట్టినందుకు నాకీ మహద్భాగ్యం. ఇటువంటి అదృష్టం కొడుకుకి కలిగించిన మహానుభావుడాయన" కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు.

ఆ నిస్సహాయతను కనిపెట్టిన ముకుందం కోపం మంచులా కరిగిపోయింది. దాని స్థానాన జాలి కలిగింది.

"ఆవేశపడకు. ఎన్నోరోజుల తర్వాత కలిశాం. నిదానంగా మాట్లాడుకుందాం. నువ్వు ఇక్కడికి ఎప్పుడొచ్చావ్? ఎక్కడుంటున్నావ్? ఏం చేస్తున్నావ్? ఈ సేల్స్‌మెన్ పనేనా? మరేదైనా కూడా చేస్తున్నావా?" ప్రశ్నల వర్షం కురిపించాడు.

"నా సొద ఏం వింటారు లెండి! మీ రైలు బయలుదేరే వేళయింది వెళ్ళండి" అన్నాడు సుబ్రహ్మణ్యం నిరాసక్తంగా.

"పోతే పోయిందిలే. ఇక్కడికి మూడు గంటల ప్రయాణం. రోజంతా బోలెడు రైళ్ళున్నాయి. మరోదాన్లో వెళ్తానులే. కలవక కలవక కలిశావు. తనివి తీరా మాట్లాడుకుందాం. ఇంతకీ నా ప్రశ్నకి సమాధానం చెప్పలేదు నువ్వు" అన్నాడు ముకుందం.

"నేనేం చెప్తాను? మీ గురించి చెప్పండి. మీరెక్కడ వుంటున్నారు? ఏం చేస్తున్నారు? పిల్లలెంతమంది?" అడిగాడు సుబ్రహ్మణ్యం.

"నీకు తెలుసుగా మా మేనమామ రైల్వేలో పనిచేస్తున్న విషయం. ఎస్సెస్సీ తర్వాత ఆయనే డిప్లొమా చెప్పించాడు. ఆయన కూతురినే పెళ్ళి చేసుకున్నాను. ఆయనే ఆ కార్ఖానాలోనే ఉద్యోగం ఇప్పించాడు. నాకిద్దరు ఆడపిల్లలు. మామయ్యకు ఇచ్చిన క్వార్టరులోనే వుంటున్నాం అందరం. మరో మూడేళ్ళలో ఆయన రిటైర్ అవుతాడు. ఆ తర్వాత ఆ ఇల్లు నా పేరుమీద ఎలాట్ అవుతుంది. పుట్టి పెరిగిన ఊరికి అలివిగానంత దూరం! అయినా జీవితం బాగానే గడిచిపోతుంది. ఇదంతా మీ నాన్నగారు పెట్టిన భిక్ష. ప్రతిరోజూ దీపం పెట్టగానే ఆయన్నే తల్చుకుంటాను." అంటూ గాల్లోనే చేతులు జోడించాడు ముకుందం.

సుబ్రహ్మణ్యం మొహంలో దాచుకున్నా దాగకుండా బయటపడ్డాయి ఈర్ష్యాసూయలు. "ఆ మాట అక్షరాల నిజం. ఆయన వలన అంతా బాగుపడ్డారు. కాకపోతే కన్న కొడుకుగా పుట్టిన నేరానికి నేనే మట్టి గొట్టుకుపోయాను" అన్నాడు.

"ఎందుకలా అంటావ్ మాటి మాటికీ. ఆయనేం చేశాడు? ఆయనంటే నీకెందు కింత కోపం" ఆదరంగా అడిగాడు ముకుందం.

విసురుగా తలెత్తాడు సుబ్రహ్మణ్యం. "ప్రస్తుతానికి ప్రయాణం వాయిదా వేసినట్టేగా రండి మా ఇంటికి వెళ్దాం" అన్నాడు.

ఆనందంగా అంగీకరించాడు ముకుందం. ఇద్దరూ బయలుదేరారు. స్టేషనుదాటి రెండు కిలోమీటర్లు నడిచి అనేక సందులూ గొందులూ తిరిగి ఓ చిన్న ఇంటిముందు ఆగాడు సుబ్రహ్మణ్యం. ఇల్లంటే అంతా కలిసి ఒక గది. అంతే. ఆ పరిసరాలు నానా ఛండాలంగా వున్నాయి. మురికి, ఈగలు, చీకటిగా వుంది.

రండి లోపలికి అన్నాడు. ఇదుగో నా భార్య, అపుడు చూశారుగా. వీడు నా కొడుకు. అంటూ నాలుగేళ్ళ పిల్లాడిని చూపించాడు. అందరి మొహాలూ పీక్కుపోయి వున్నాయి. ఆ ఇంట్లో దరిద్రం తాండవిస్తోంది. ఓ మూల నులకమంచం మరో మూల కిరోసిన్ స్టౌ నాలుగు గిన్నెలు. వాటి వెనక పడుంది ఒక ఫోటో. అద్దం పగిలిపోయింది. ఫ్రేమ్ ఊడొస్తుంది. అందులోంచి చల్లగా నవ్వుతున్నాడు రామయ్య మాస్టారు. ఆయన పక్కన అపర సాధ్వీమ తల్లి అమ్మగారు.

వారిని ఆ దీనావస్థలో చూసిన ముకుందం కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

పదిమంది సంతానంలో అయిదవ వాడు ముకుందం. అయిదో తరగతి దాకా వీధి బళ్ళో చదువుకున్నాడు. ఆ తర్వాత చదువు మాన్పించి తీసుకువెళ్ళి ఆ ఊళ్ళోని వడ్ల మరలో పనికి కుదిర్చాడు తండ్రి. అక్కడేదో అవకతవక పనిచేస్తే పన్లోంచి తీసేశారు.

"దొంగ వెధవా. ఏదో నాలుగురాళ్ళు సంపాదించి నీ పొట్టయినా నువు పోషించుకుంటావు అని వాళ్ళ కాళ్ళు పట్టుకుని పని ఇప్పిస్తే అది కాస్తా ఊడగొట్టు కుంటావా?" అంటూ తాట లేచిపోయేలా కొట్టాడు తండ్రి.

ఆ తర్వాత తీసికెళ్ళి వరి పొలంలో పనికి కుదిర్చాడు. "ఒళ్ళు దగ్గర పెట్టుకుని పనిచెయ్. ఈసారి ఏదైనా పొరపాటు జరిగిందా నరికి పోగులు పెడతా" అని బెదిరించి మరీ వెళ్ళాడు.

దొరువు లోంచి నీళ్ళు తెచ్చి నారుమడి తడపాలి. గూడలు పడిపోయేలా ఆ పని చేస్తూవుండేవాడు. ఒక రోజు మధ్యాహ్నం పని ఆపి అన్నం తినడానికి పోయాడు యజమాని. జాగర్తగా చూస్తుండు. నేనొచ్చాక నువ్వు అన్నం తిందువుగాని అని చెప్పి

వెళ్ళాడు. చెట్టుకింద నీడలో నడుం వాల్చాడు. అలిసిన శరీరం, నిద్ర తూలు కొచ్చింది. ఏమరుపాటుగా వుండేసరికి దొంగ గొడ్డు ఒకటి వచ్చి మడిలో దూరింది. ఆదరా బాదరా మెయ్యసాగింది. అది చూసి దాన్ని తరిమేడు ముకుందం. దాంతో అది బెదిరి అంత మేర మడి తొక్కి పారిపోయింది.

వణికిపోతూ నిలబడ్డాడు ముకుందం. అంతలోనే వచ్చిన యజమాని జరిగినది చూసి కర్రపుచ్చుకుని వెంటబడ్డాడు. దెబ్బలకు భయపడి అందకుండా పారిపోయాడు ముకుందం. ఇంటికిపోతే తండ్రిచేత చావుదెబ్బలు తినాలి. అందుకే కాలవలో దూకి చచ్చిపోదాం అని కాలవ దగ్గరికి వెళ్ళాడు. తీరా వెళ్ళాక దూకడానికి ధైర్యం చాలక ఒడ్డున కూర్చుని ఏడుస్తూ వుంటే, "ఎవడ్రా అదీ?" అని కేక వినిపించింది.

తలతిప్పిచూస్తే చెయ్యెత్తు మనిషి చేతిలో గొడుగు "ఏవూర్రా మీది? ఒక్కడివీ ఇక్కడేం చేస్తున్నావ్? చీకటి పడుతుంది ఇంటికి పో" అన్నాడు ఆప్యాయంగా.

"నేను వెళ్ళను. వెళ్తే మా నాన్న చంపేస్తాడు" అంటూ బావురుమని ఏడిచాడు ముకుందం. గబగబ దగ్గరికి వచ్చాడాయన "ఏడవకు నాయనా ఏడవకు" అంటూ బుగ్గలు తుడిచి తలనిమిరాడు. అసలు విషయం తెలుసుకుని "సరేలే నాతోరా" అని వెంట బెట్టుకుని తీసుకువెళ్ళాడు.

చిన్న పెంకుటిల్లు. ముందు వెనకా పెద్ద ఆవరణ. తన తోటివాళ్ళూ, తనకంటే పెద్దవాళ్ళు పది పన్నెండు మంది పిల్లలున్నారు. వాళ్ళతోబాటు అన్నం తిని ఒళ్ళు ఎరగకుండా నిద్రపోయాడు.

తెల్లవారి వెతుక్కుంటూ వచ్చాడు తండ్రి. నానా తిట్లూ తిట్టి చావగొట్టబోతే ఆయన అడ్డుపడ్డాడు. ఈ పసి వెధవని తీసికెళ్ళి పన్లో పెట్టినా ఏం సంపాదిస్తాడూ? చదువుకోనీ" అన్నాడు.

"ఏం సంపాదించక పోయినా వాడి పొట్ట వాడు పోషించుకుంటాడు. ఇక చదివించే శక్తి నాకు లేదు" అన్నాడు తండ్రి.

"నీకు శక్తిలేకపోతే నా దగ్గర వదిలెయ్ యస్సెసెల్సీ దాకా చదువు చెప్పిస్తాను. ఆ తర్వాత వాడి ఇష్టం నీ ఇష్టం" అన్నాడు ఆయన.

ముకుందం నేలమీద దొర్లి దొర్లి ఏడిచాడు ఇంటికి రానని. దాంతో విసుగేసి వెళ్ళిపోయాడు తండ్రి.

రామయ్య మాష్టారు దిక్కులేని పిల్లలని చేరదీసి స్కూలు ఫైనలు దాకా చదువు చెప్పిస్తాడు. ఎపుడు చూసినా పది పన్నెండు మంది పిల్లలుంటారు ఆయన దగ్గర. ఆయనకు పిల్లలు లేరు. నాలుగెకరాల భూమి, స్వంత ఇల్లు.

వాకిట్లో మూలగా ఓ సావిడి వుంది. పిల్లలు ఇంటిపనీ తోటపనీ చేసేవారు. సావిట్లో పడుకొనేవాళ్ళు. "రెండు గేదెల పాడి, పెరటినిండా కూరలు. పొలంలో పండిన ధాన్యం. ఇవన్నీ చాలవా ఆ చిన్న వెధవల అన్నానికి" అనేవాడు మాష్టారు.

ఏడాదికి ఒకసారి పిల్లలకి రెండు జతల బట్టలు కుట్టించేవాడు. సైను చొక్కాలు ఖాకీ నిక్కర్లు. స్కూల్లో చదువులు ఎలాగూ ఉచితమే.

తెల్లవారు జామున లేచి తెల్లవారేదాకా చదువు. తెల్లవారాక ఇంటిపని తోటపని. తర్వాత స్నానాలు. దొడ్లో మూడురాళ్ళ పొయ్యిమీద గుండిగతో అన్నం వండేది సీతమ్మగారు.

ఎనిమిదింటికి అన్నం, పచ్చడి, మజ్జిగ, కడుపునిండా తిని స్కూలికి పోయేవాళ్లు. మధ్యాహ్నం పూట అన్నం కూర మజ్జిగ. సాయంత్రం స్కూలునుండి వచ్చి కాసేపు ఆటలు. ఆ తర్వాత ఇంటిపని, తోటపని. ఏడింటికి భోజనం. అన్నం పులుసు, మజ్జిగ. తర్వాత తొమ్మిదింటిదాకా చదువు. ఆపై నిద్ర.

ఆ జీవితం పిల్లలకు స్వర్గంలా వుండేది. కడుపునిండా తిండి, చదువు. ఆపై అమ్మగారి ప్రేమ. అయ్యగారి ఆదరణ.

పిల్లలని కూర్చోబెట్టి బోలెడు కబుర్లు కథలు చెప్పేవారు మాష్టారు.

అష్టకాలు, స్తోత్రాలూ, మంత్రపుష్పం వల్లెవేయించేవాడు. అయినవారి ఆదరణకు నోచుకోని ఆ పిల్లలకు అపూర్వమైన బాల్యం అందజేసేవాడు.

యస్సెసెల్సీ అవగానే ఇక మీ దారి మీరు చూసుకోండి అని చేతుల్తో కాస్త డబ్బు పెట్టి సాగనంపుతుంటే ఏడుస్తూ వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళేవారు ఆ పిల్లలు.

ముకుందం యస్సెసెల్సీ చదువుతుండగానే ఒక శుభవార్త తెలిసింది. అమ్మగారు తల్లికాబోతోంది. అప్పటికి మాష్టారికి యాభై వచ్చాయి. ఆవిడకి నలభై దాటాయి. పోన్లే ఇంతకాలానికి ఆవిడ కడుపు పండబోతోంది అని ఆనందించారు అందరూ.

ముకుందం ఆ స్వర్గానికి దూరంగా వచ్చేసిన నెలరోజులకే అమ్మగారికి కొడుకు పుట్టాడని తెలిసింది. తల్లిని అడిగి, ప్రాధేయపడి నాలుగు రూపాయలు ఇప్పించుకొని

ఆ ఊరిసంతలో చిన్న చొక్కా ఒక ప్లాస్టిక్ గిలక కొనుక్కొని వెళ్ళాడు. ఇవన్నీ ఎందుకురా అన్నారు మాస్టారు. పిల్లవాడికి సుబ్రహ్మణ్యం అని పేరు పెట్టారు.

ఆ తర్వాత మేనమామ తన బాధ్యత వహించడం డిప్లొమా చదవడానికి వెళ్ళడం జరిగిపోయాయి. ఉత్తరాలు రాస్తూనే వుండేవాడు. పెళ్ళయ్యాక భార్యని వెంటబెట్టుకుని వెళ్ళి ఆ దంపతులకు నమస్కరించి వారి ఆశీర్వాదం పొంది వచ్చాడు. ఆ తర్వాత ఉద్యోగంలో చేరగానే నూటపదహార్లు మాస్టారికి మనియార్డర్ చేశాడు. ఆ తర్వాత సంసార సాగరంలో మునిగిపోయాడు.

అమ్మగారు స్వర్గస్తులు అయ్యారని తెలిసి కుళ్ళికుళ్ళి ఏడిచాడు. మరో అయిదు సంవత్సరాలకి మాస్టారు అవతారం చాలించారని తెలిసి గుండె పగిలిపోయింది. వెంటనే వెళ్ళి అంతిమ దర్శనం చేసుకోవాలని వున్నా అలవికానంత దూరం. పదోరోజుకి వెళ్ళాడు.

మాస్టారి దగ్గర వుండి చదువుకున్న విద్యార్థులు చాలామంది వచ్చారు. ఆనాటి వైభవం చాలా తగ్గిపోయింది. అనాథలెవ్వరూ లేరు. పాడిగేదెలు లేని గొడ్లసావిడి బోసిపోతుంది. మాస్టారి కొడుక్కి ఇరవై ఏళ్ళు. మిగిలివున్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. తనకళ్ళతో కొడుకు పెళ్ళి చూడాలని మాస్టారు ముచ్చట పడ్డారట. కోడలు బుద్ధిమంతురాలు నెమ్మదైన పిల్ల.

కర్మ యథావిధిగా జరిగిపోయింది. పన్నెండవ రోజున సంతర్పణ, ఆశీర్వచనం. చనిపోయిన మాస్టారుని అందరూ వేనోళ్ళ పొగిడారు. ఆశీర్వచనంలో అందరూ సుబ్రహ్మణ్యానికి బట్టలు పెట్టారు. అందరూ తలా కొంచెం డబ్బు చేతుల్లో పెట్టారు. ధైర్యంగా వుండు. నువ్వు మా గురుపుత్రుడివి. అంటే స్వంత తమ్ముడికంటే ఎక్కువ. నీకే అవసరం వచ్చినా మాకు తెలియజెయ్యి అని చెప్పి అడ్రసులు ఇచ్చి ఎవరిదారిన వాళ్ళు వెళ్ళారు.

ఆ తర్వాత మళ్ళీ ఇదే చూడడం.

"కళ్ళారా చూశారుగా నా వైభవం. ఆయన మహానుభావుడే. కాదని నేననను. కానీ కన్నకొడుకు ఎలా బతుకుతాడో అనే ఆలోచన లేకపోయింది. పరోపకారాలతో, దానధర్మాలతో సగం పొలం కరిగిపోయింది. నా స్కూలు చదువు పూర్తి అయి పై చదువుకి పక్కవూరికి వెళ్దామనుకుంటే అప్పట్లో అమ్మ ఆరోగ్యం పూర్తిగా పాడైపోయింది. ఆయనా పెద్దవారైపోయారు. వాళ్ళనలా వదిలి వెళ్ళలేక అక్కడే వుండి పొలం పనిలో

దిగిపోయాను. అనారోగ్యాలకీ మందూ మాకులకీ మరో ఎకరం కరిగిపోయింది. మిగిలిన ఎకరం పొలం వ్యవసాయంతో ఏం బతుకుతాను?, దానికి సాయం నీ పెళ్ళి చూసి పోతానని గోలచేసి పెళ్ళిచేసారు. నాకు తోడు మెడకు గుదిబండ.

"ఆయన పోయాక ఆ ఊళ్లో వుండలేకపోయాను. అతివృష్టీ, అనావృష్టీ అన్నట్లూ వ్యవసాయం సాగక అప్పులు పెరుగుతుంటే అయినకాడికి పొలం, ఇల్లు అమ్మేసి దేశం మీద పడ్డాను. నాన్నగారి వల్ల సాయం పొందిన వారి దగ్గరకూ వెళ్ళి సహాయం అర్థించాను.

"మీకు తెలుసుగా వారికి పెద్ద ఉద్యోగస్థులెవరూ లేరు. అప్పటికీ నన్ను ఆదరించి తమ శక్త్యనుసారం పదో పాతికో చేతిలో పెట్టారు. అంతకంటే ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు? నాకు ఉపాధి కల్పించగల పలుకుబడి గానీ, నన్ను శాశ్వతంగా పోషించగల ఆర్థిక స్థోమతగానీ వారికి లేదు కదా! భార్యాబిడ్డలని వెంటేసుకుని అలా ఇల్లిల్లూ తిరుగుతూ ఎంతకాలం బతకగలను? ఏదో చిన్నా చితకా పన్లు చేస్తూ తిరిగి తిరిగి ఇక్కడికి వచ్చి పడ్డాను.

"ఈ అగరొత్తులు అమ్మితే వచ్చే కమిషనుతో ఒకపూట తినగలిగితే మహద్భాగ్యం. నా చిన్నతనంలో మా అమ్మ పెద్ద ఇత్తడి గిన్నెతో అన్నం వార్చి అందరికీ పెట్టడం నాకింకా బాగా గుర్తు. ఈనాడు నా కన్న బిడ్డకి పట్టెడు అన్నం పెట్టడానికి నానా అగచాట్లు పడుతున్నాను.

ఈ బతుకు ఎన్నాళ్ళో ఈడ్చలేను. ఏదో మంచిరోజు చూసుకుని, మా నాన్నను మనసారా స్మరించుకొని కుటుంబసమేతంగా ఆ గంగలో దూకుతాను".

అంటూ మోకాళ్ళలో తలదాచుకుని కుళ్ళికుళ్ళి ఏడిచాడు సుబ్రహ్మణ్యం. కొంగులో మొహం దాచుకుంది శారద.

ముకుందం కడుపు తరుక్కుపోయింది. ఓదార్పుగా సుబ్రహ్మణ్యం తల నిమురుతూ వుండిపోయాడు.

"నీ బాధ నేను అర్థం చేసుకోగలను. నీ మీద సానుభూతి వుంది. కానీ కాస్త నా గురించి కూడా ఆలోచించు. మనిషి జన్మ ఎత్తాక అంతో ఇంతో విశ్వాసం వుండక పోదు. ఈనాడు ఇలా బతుకుతున్నానంటే ఇదంతా ఆయన పెట్టిన భిక్ష. ఆయనని ఎవరైనా పల్లెత్తుమాట అంటే భరించలేను. ఆయన కన్నబిడ్డవి నువ్విలా వుంటే మాకు మాత్రం బాధకదూ. ఏదో మార్గం ఆలోచిద్దాం. నువ్వు ధైర్యంగా వుండు" అన్నాడు.

ఆ తర్వాత బజారుకి వెళ్ళి వారం రోజులకి సరిపడా బియ్యం ఉప్పు పప్పు తెచ్చి పడేశాడు. సుబ్రహ్మణ్యం వేసుకున్న బట్టలకున్న చిరుగులు చూసి బాగ్ తెరిచి అందులో వున్న పాంటు షర్టు తీసి ఇచ్చాడు. దారి ఖర్చులకి వుంచుకుని మిగిలిన డబ్బు అతని చేతిలో పెట్టాడు.

"నేనీ ఊరు తరచూ వస్తూవుంటాను. వచ్చినప్పుడల్లా నీ దగ్గరికి వస్తాను. నా అడ్రెస్ ఇస్తాను. నువ్వు ఈ మకాం మారిస్తే నాకు తెలియజెయ్యి. ఈ లోగా ఎటువంటి దుడుకుపని చెయ్యనని నాకు మాట ఇవ్వు" అని అతని చేత ఒట్టు వేయించుకుని బయలుదేరాడు.

స్టేషనుకి వచ్చి రైలు ఎక్కాడు. అతని మనసు అల్లకల్లోలంగా ఉంది. అనుకోకుండా సుబ్రహ్మణ్యం కనిపించడం, అతని దుస్థితి, అతడిని కలిచివేస్తున్నాయి. ఎలాగైనా సుబ్రహ్మణ్యాన్ని ఆదుకోవాలి. ఆ విధంగా అయినా గురుదక్షిణ చెల్లించుకోవాలి. కానీ మార్గం?

నిజానికి అతనికేదో దారి చూపించేదాకా కొన్నాళ్ళు వచ్చి తన ఇంట్లో ఆశ్రయం ఇవ్వగల ఆర్థిక స్థోమత వుంది తనకు. ఓవర్‌టైములూ, టి.ఏ.లు కలిపి ఏడువేలదాకా వస్తుంది. కానీ సమస్య అది కాదు. భార్య అదొకరకం మనిషి. నువ్వు చదివిన చదువు మా నాన్న చెప్పించాడు. నువ్వు చేస్తున్న ఉద్యోగం మా నాన్న ఇప్పించాడు. నువ్వుంటున్న ఈ ఇంటి యజమాని మానాన్న. అని క్షణానికోసారి గుర్తుచేస్తోంది. భర్తని తన చెప్పుచేతుల్లో పెట్టుకోవాలని తపన. అతని సంపాదన అంతా తనదే అనే స్వార్థం అణువణువునా జీర్ణించుకున్న వ్యక్తి. ముకుందం తండ్రికి నాలుగు రూపాయలు పంపాలంటే ఇంట్లో అదోపోరు. అటువంటి వ్యక్తి, భర్తకి చిన్ననాడు సహాయం చేసిన వ్యక్తి కొడుకుని, అతని కుటుంబాన్ని ఆదరిస్తుందని ఆశించడం అత్యాశకు పోవడమే అవుతుంది.

భార్య సహకారం లేకుండా తనేవిధంగా సుబ్రహ్మణ్యానికి సాయం చెయ్యగలడు? ఏదైనా చిన్న పని ఇప్పించాలన్నా ఎవరూ తెలిసినవాళ్ళు లేరు. మరి ఏది మార్గం?

ఇల్లు చేరాడు. "వెయిటింగ్ రూమ్‌లో స్నానం చేస్తూవుంటే ఎవరో బట్టలూ డబ్బూ కొట్టేశారు" అని అబద్ధం ఆడి భార్యచేత తిట్ల తలంటు పోయించుకున్నాడు.

అహోరాత్రులూ ఒకే ఆలోచనతో సతమతం అవసాగాడు. ఓ రోజు డ్యూటీ ముగించి సైకిలు తొక్కుకుంటూ ఊరి చివరికి వెళ్ళిపోయాడు. అక్కడ అటూ ఇటూ

తిరుగుతూ వుంటే అడ్డదిడ్డంగా పెరిగిన తుప్పల్లో ఏదో కట్టడం కనిపించింది. ఏవిటబ్బా అది? ఏదైనా సమాధా? అనుకుని తుప్పల్లోంచి దాటుకుంటూ దానిదగ్గరకు వెళ్ళాడు.

నాలుగు చదరపు అడుగుల ఇటుకలతో కట్టిన కట్టడం. పైకప్పు లేదు. గోడలు కూడా జీర్ణావస్థలో వున్నాయి. లోపల నల్లరాయిమీద చెక్కిన ఆంజనేయస్వామి విగ్రహం. "ఏనాటిదో ఇది. శిథిలమై పోయింది" అనుకుంటూ ఓ దణ్ణం పెట్టి తిరిగి రోడ్డు ఎక్కాడు. బట్టలనిండా పట్టిన ముళ్ళకాయలు తీసి పారేస్తూ వుండగా వచ్చిందో ఆలోచన. నిజమే అలా చేస్తే, చుట్టుపక్కల దృష్టిసారించాడు. కాస్త దూరంలో సగంగట్టు విరిగిపోయిన బావి వుంది.

ఆ రోడ్డుపక్కనే వున్న బండమీద కూర్చుని చాలాసేపు దీర్ఘంగా ఆలోచించాడు. ఓ పథకం రూపుదిద్దుకుంది. హుషారుగా ఇంటిదారి పట్టాడు. మరుసటి వారం కలకత్తా వెళ్ళినప్పుడు సుబ్రహ్మణ్యం దగ్గరికి వెళ్ళి తన ఆలోచన అతని చెవిన వేశాడు.

అంతా విని తెల్లబోయాడు సుబ్రహ్మణ్యం. ఎందుకింత హైరానా. నన్ను వెంటబెట్టుకొని వెళ్ళి మా తమ్ముడు అని చెప్తే సరిపోదా? అన్నాడు.

"నా తమ్ముడివని చెప్తే ఎవరూ సాయం చెయ్యరు? నీకు సంబంధించిన వాడు ఆయన తండ్రి వల్ల ఉపకారం పొందింది నువ్వు, ఆ బాగోగులు నువ్వే చూసుకో. మధ్యలో మాకేం దురద?" అంటారు. అంతకన్నా అపరిచితుడుగా ఊళ్ళోకి వస్తేనే మనపని నెరవేరుతుంది అని నచ్చచెప్పాడు.

అంతా విని సరే అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఊరికి రాగానే మూర్తిగారి దగ్గరికి వెళ్ళాడు ముకుందం. సార్ మీతో కాస్త పర్సనల్‌గా మాట్లాడాలి" అన్నాడు. అటువంటి పర్సనల్ వ్యవహారాలు మూర్తిగారికి కొత్తకాదు. మూర్తిగారు చాలా మంచివాడు. జాతకాలు చూడడం ఆయన హాబీ ప్లస్ సైడ్ బిజినెస్ కూడా. జాతకం చూసి దోషం వుంటే దానాలూ, పూజలూ, సూచిస్తాడు. ఆయనవల్ల లబ్ధిపొందిన వాళ్ళు చాలా మంది వున్నారు. ఊళ్ళో సగం మంది ఆయన క్లయింట్లే.

జాతకం విషయమే అనుకుని ఏవిటో చెప్పండి అన్నాడు. ముకుందం చెప్పినది విని ఆశ్చర్యపోయాడు. బతుకు నిలబెట్టిన పుణ్యాత్ముడి ఋణం తీర్చుకోవాలనే మీ తపన నాకర్థం అయింది. ఈ మీ ఆలోచన కూడా దివ్యంగా వుంది. అలాగే కానివ్వండి. నా వంతు సాయం నేను చేస్తాను అన్నాడు.

మళ్ళీ ట్రిప్‌లో కలకత్తా వెళ్ళినప్పుడు సుబ్రహ్మణ్యంతో వివరంగా మాట్లాడాడు. “కాస్త తెలివిగా సమయస్ఫూర్తితో వ్యవహారం జరిపించే బాధ్యత నీదే ఇక” అన్నాడు. అలాగే అన్నాడు సుబ్రహ్మణ్యం.

కలకత్తానుంచి రాగానే శాస్త్రిగారికి ఫోన్ చేశాడు ముకుందం. ఆ శాస్త్రిగారు ఉన్నతోద్యోగి. ఆ ఊళ్ళోవున్న తెలుగువారందరికీ ఆయనదే పెద్ద పదవి. తెలివిగలవాడే. కాకపోతే కాసింత తిక్క. ఎదుటివాడు చెప్పింది చచ్చినా వినడు. మీ చొక్కా ఎంత బాగుందండీ ఇక ముందు కూడా ఇలాంటివే వేసుకోండి అంటే వున్నపాటున వేసుకున్న చొక్కా విప్పి తలకు చుట్టుకునేరకం. రోడ్డుమీద ఎంత ఠీవిగా నడుస్తున్నారు అంటే అమాంతం డొంకకి అడ్డం పడి నడుస్తాడు.

శాస్త్రిగారికి ఫోన్‌చేసి యోగక్షేమాలు విచారించి “ఓ ముఖ్యమైన విషయం చెప్పాలి మీతో. ఇవ్వాళ కలకత్తానుండి వస్తూవుంటే రైల్లో ఓ మనిషి కనబడ్డాడు. అతనికి ఆంజనేయస్వామి కలలో కనిపించాడట. అందుకు మనూరు వస్తున్నాడట. మీ ఊళ్ళో పెద్దవారు ఎవరు? అని అడిగాడు. మీ గురించి చెప్పాను. కానీ మా శాస్త్రిసార్ ఇలాంటి కట్టుకథలు నమ్మరు. ఇలా ముక్కుమొహం తెలీని వాళ్ళకి ఎంత మాత్రం సహాయం చెయ్యరు. అని ఖచ్చితంగా చెప్పేశాను. ముందు జాగర్తపడతారని మీకు చెప్తున్నాను. వాడే మోసగాడో జాగర్తసార్” అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. శాస్త్రిగారికి చిర్రెత్తుకొచ్చింది. చిన్న ఉద్యోగులు ఇలా ఫోన్‌లో మాట్లాడ్డం ఆయనకి అంతగా నచ్చదు. దానికి తోడు అతనెవరో తనగురించి అడిగితే ముకుందమే వకాల్తా పుచ్చుకొని మా సార్ సహాయం చెయ్యడు అని చెప్పడం మరీ ధూర్తలక్షణంగా అనిపించింది. అంతటితో ఆగక మోసగాడేమో జాగర్త అని తనంతటివాడిని హెచ్చరించే సరికి అరకాలిమంట నెత్తికి ఎక్కింది.

అందుకే ఆ రాబోయే వ్యక్తికోసం ఎదురు చూడసాగారు శాస్త్రిగారు.

మరికాసేటికి వచ్చాడు సుబ్రహ్మణ్యం. ఎగాదిగా చూశాడు శాస్త్రిగారు. మనిషి శుభ్రంగా వున్నాడు. నేతపంచె షర్టు, భుజం మీద తువ్వాలు. నుదుట నిలువు బొట్టు “నమస్కారం అయ్యగారూ! నా పేరు సుబ్రహ్మణ్యం. మాది బెజవాడ దగ్గర పల్లెటూరు. బ్రాహ్మడిని. అక్కడ ఆస్తులన్నీ కరిగిపోగా కడుపు చేతబట్టుకొని కలకత్తా చేరాను. అక్కడ అగరొత్తులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తూ వుంటాను. మా తండ్రిగారు రామభక్తులు. నేనూ అంతే. కిందటి వారం ఆంజనేయస్వామి వారు కలలో కనపడి ‘ఫలాని ఊళ్ళో ఫలాని చోట ఆలనా పాలనా లేకుండా పడి ఉన్నాను. నువ్వు వచ్చి

నాకు ధూపదీప నైవేద్యాలు అమర్చు' అని సెలవిచ్చారు. ముందు ఏదో నా భ్రమ అనుకున్నాను. కానీ రెండు మూడు మార్లు అదే కల వచ్చింది. ఆయన మీద భారం వేసి బయలుదేరాను.

"ఇక్కడ నా కెవరూ పరిచయం లేరు. విచారిస్తే మీపేరు చెప్పారు. మీ దగ్గరికి వచ్చాను. ఇక మీ ఇష్టం. మీరు సరేనంటే స్వామివారి ఆనతిప్రకారం ఇక్కడే వుండి సేవచేసుకుంటాను. కాదంటే తిరిగి వెళ్తాను" అన్నాడు వినయంగా.

అతని వినయవిధేయతలు శాస్త్రిగారికి నచ్చాయి. కాకపోతే ఇటువంటి విషయంలో నిర్ణయం తీసుకునే బాధ్యత వొంటరిగా స్వీకరించడం అంత సమంజసం కాదేమో అనిపించింది. ఆమాటే అతనితో చెప్పి నలుగురు పెద్ద మనుషులని రప్పించాడు. అందులో మూర్తిగారు కూడా వున్నారు. అందరూ చర్చించారు. "ఇక్కడి పాడుబడిన గుడివున్న విషయం మనకెవ్వరికీ తెలియదు. అతను చెప్తున్నది నిజమే అయితే అది స్వామి నిర్ణయం. అడ్డుపడడానికి మనం ఎంతటివాళ్ళం ఏదో మన చేతనైన సాయం మనం చేద్దాం" అన్నారు మూర్తిగారు. ఆ మాటే అందరికీ నచ్చింది.

ఆ పూటకి శాస్త్రిగారింట్లో భోజనంచేసి పడుకున్నాడు సుబ్రహ్మణ్యం. తెల్లవారుతూనే పదిమంది వెంటరాగా పలుగూ పారా పట్టుకుని దేవుడిని వెతుక్కుంటూ బయలుదేరాడు. సులభంగానే దర్శనం ఇచ్చాడు దేవుడు.

వెంటవచ్చిన జనం లెంపలు వేసుకుని సుబ్రహ్మణ్యం వంక భక్తిగా చూశారు. "ఎంత అదృష్టవంతుడో స్వామి స్వయంగా కలలో కనిపించాడుట! ఏ జన్మపుణ్యమో లేకపోతే ఊళ్ళో ఇంతమందిమి వున్నాం మనకు కనిపించాడా?" అనుకున్నారు.

సుబ్రహ్మణ్యం మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా తుప్పలు కొట్టి దారి చెయ్యడంలో నిమగ్నమైపోయాడు. అందరూ సహాయం చెయ్యబోతే వద్దని చేతులు జోడించాడు. ఇది స్వామివారు ఆదేశించిన సేవ. నన్ను వొంటరిగానే చేయనియ్యండి అన్నాడు.

ఈ వార్త తెలిసి జనం గుమిగూడారు. ఎవరో వెళ్ళి నాలుగు కొబ్బరి మట్టలు కొట్టుకొచ్చారు. మరెవరో ప్రమిదా నూనె వత్తీ తెచ్చారు. మరెవరో పూలూ పళ్ళూ పట్టుకొచ్చారు. శాస్త్రిగారింట్లో పానకం వడపప్పూ తయారు చేయించారు.

మధ్యాహ్నానికి గుడిదాకా చేరడానికి సన్నని కాలిబాట తయారు చేశాడు సుబ్రహ్మణ్యం. గుడిలోని చెత్తా చెదారం ఎత్తిపోసి, పైకప్పుగా కొబ్బరి మట్టలు

అమర్చాడు. ఎవరినో అడిగి తాడూ బొక్కెనా తెప్పించి బావిలో నీళ్ళు తోడితెచ్చి ఆలయం శుభ్రం చేశాడు. రెండు చాదల నీళ్ళు తోడుకుని స్నానం చేసి, నీళ్ళు తెచ్చి స్వామివారికి అభిషేకం చేసి దీపం వెలిగించాడు.

పూలతో పూజించి గొంతెత్తి శ్రావ్యంగా హనుమాన్ చాలీసా గానం చేశాడు. నైవేద్యం పెట్టి హారతి ఇచ్చాడు. హారతి పళ్ళెం గలగల చిల్లర డబ్బులు రాలాయి. భక్తులంతా తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అనంతరం అక్కడ చేరిన వారిని ఉద్దేశించిన నాలుగు మాటలు మాట్లాడారు శాస్త్రిగారు. "జరిగినదంతా మీరు కళ్ళారా చూసారు. నిన్న సుబ్రహ్మణ్యం మాటలు విని అవన్నీ కట్టుకథలనీ నమ్మవద్దనీ నన్ను హెచ్చరించాడు ఒక ప్రబుద్ధుడు. కానీ నాకెందుకో ఆ మాటలు నమ్మాలనిపించలేదు. అదీ దైవప్రేరణే అని నా అభిప్రాయం. మనమంతా నిమిత్తమాత్రులం. ఏది ఏమైనా స్వామివారి అనుగ్రహానికి అందరం పాత్రులమైనాం. ఈ సుబ్రహ్మణ్యానికి మా ఔట్ హౌస్‌లో బస ఏర్పాటు చేస్తాను. మనందరం కలసి తలాకొంతా వేసుకొని అతనికి వేతనం ఏర్పాటు చేద్దాం" అన్నాడు. అందరూ ఏకీభవించారు. నెలకి రెండొందలు ఇచ్చేలా తీర్మానం అయింది. ఆపైన హారతి పళ్ళెం డబ్బులు అతనికే.

నాలుగు రోజుల తర్వాత కొడుకుని తీసుకొని భర్తదగ్గరికి వచ్చింది శారద. భార్యాభర్తలు దినం అస్తమానం కష్టపడసాగారు. ఆలయం చుట్టూ తుప్పలన్నీ నరికి చుట్టూ కంచె ఏర్పాటు చేశాడు సుబ్రహ్మణ్యం. చుట్టూ స్థలం అలికి అద్దంలా తయారు చేసింది శారద. మందార, నందివర్ధనం, తులసి మొదలైన మొక్కలు తీసుకొచ్చి నాటారు. బావినుండి గుడిదాకా బాట తయారు చేశారు. వారి భక్తిశ్రద్ధలు చూసి ఆనందించారు అందరూ. రెండుపూటలా భోజనం దొరకడంతో దంపతులు తేరుకున్నారు. డొక్కుల్లా వున్న మొహాలు కాస్త కాంతి వంతంగా మారాయి.

ఇదిలా వుండగా తనదగ్గరకు వచ్చిన ఒక తెలుగువాడికి దానం చెయ్యమని సూచించి "మన సుబ్రహ్మణ్యానికే ఇవ్వండి. మంచి భక్తుడు. దుర్వ్యసనాలు లేనివాడు. సద్బ్రాహ్మణుడు" అని చెప్పాడు మూర్తిగారు.

దానం ఇవ్వడానికి వచ్చిన వారిని కూర్చోబెట్టి సలక్షణంగా సంకల్పం చెప్పించి యథావిధిగా దానం స్వీకరించాడు సుబ్రహ్మణ్యం. ఆ ఇచ్చిన వ్యక్తికి ఎంతో తృప్తి కలిగింది. "చాలా చక్కగా జరిపించారు. క్రిందటి సంవత్సరం హైదరాబాదులో దానం ఇచ్చాను. ఇక్కడా అలాగే చేయించారు" అన్నాడు.

"చిన్నతనంలో మా ఊళ్ళో చూసేవాడిని. అది గుర్తుంచుకుని అదే విధంగా చేశాను. మీకు తృప్తి కలిగింది అదే పదివేలు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఆ పూట గిన్నెనిండా ఉలవచారు పెట్టింది శారద. కడుపునిండా కమ్మగా తిని "ఉలవ పప్పు అంటే వుదాసీనంగా చూస్తాం గానీ వండేతీరున వండితే కందిపప్పు కంటే కమ్మగా వుంటుంది అనేది మా అమ్మ" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఆ దానం ఇచ్చినాయన చేసిన ప్రచారం వల్ల మూర్తిగారి చలవవల్ల తరుచూ దానం దక్షిణా అందుతూనే వుండేవి. ఫలితంగా వాళ్ళింట్లో సకల ధాన్యాలూ చేరసాగాయి. డబ్బుల డబ్బాలో నాలుగు డబ్బులు కనిపించసాగాయి.

మరుసటి శుక్రవారం శారదను పిలిపించి ముత్తైదు వాయనం ఇచ్చింది మూర్తిగారి భార్య. "ఏవిటో ఈ దిక్కుమాలిన ఊళ్ళో ఒక నోమా? వ్రతమా? ఇవాల్టికి ఈ సదుపాయం అమరింది. శుక్రవారం పూజచేసుకుని ముత్తయిదువుని పిల్చి తాంబూలం ఇచ్చాను. తృప్తిగా వుంది" అని నలుగురితో చెప్పింది.

ఆ తరువాత శారదకు చేతినిండా పని. మంగళవారం శుక్రవారం ఎవరో ఒకరు పిల్చి తాంబూలం ఇస్తూనే వుండేవారు.

ఆ మరుసటి నెలలో హనుమజ్జయంతి సందర్భంగా అందరూ చందాలు వేసుకుని ఆలయాన్ని మరో అడుగు ఎత్తుపెంచి సున్నం వేయించారు. పైన ఏస్‌బెస్టాస్ రేకులు వేయించారు. గుడిముందు కాస్తమేర సిమెంటు చేయించి దానికి నాలుగువైపులా గుంజలు పాతి పైన రెల్లుగడ్డితో పందిరి వేశారు. ఇత్తడిగంట తెప్పించి కట్టారు.

ఆ మాత్రం హంగు ఏర్పడేసరికి భక్తుల రాక ఎక్కువ అయింది.

అనాథలను చేరదీసి ఆదరించి అన్నదానం విద్యాదానం చేసిన ఆ మహానుభావుడి పుణ్యం వల్లనో, గురువుగారికి లేకలేక కలిగిన సంతానానికి మంచి జరగాలని ముకుందం పడిన తపన కారణంగానో, తుప్పల్లోపడి వున్న తనను వెలికి తీసి సేవచేస్తున్న భక్తునిపట్ల ఆ దేవుడికి కలిగిన కరుణ వల్లనో సుబ్రహ్మణ్యం జీవితం ఒక గాడిన పడింది.

అయితే ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోకుండా మనసా వాచా కర్మణా శ్రద్ధా భక్తులతో స్వామిసేవే పరమార్థంగా భావించే సుబ్రహ్మణ్యం అందరి ఆదరణకూ పాత్రుడయ్యాడు. గుడిలో స్వామి సేవే కాకుండా అవసరం అయితే సత్యనారాయణ వ్రతం, పుస్తకం చూసి చేయించే స్థాయికి ఎదిగాడు.

ఏడాది గిర్రున తిరిగి వచ్చింది.

తండ్రి మరణవార్త విని వున్నపాటున వూరుకెళ్ళిన ముకుందం ఏవో పనులూ వ్యవహారాలూ చక్కబెట్టుకుని ఇంచుమించు రెండు నెలల తర్వాత తిరిగి వచ్చాడు.

శాస్త్రిగారికి ట్రాన్సఫర్ అయివెళ్ళిపోయారని ఆ బంగళాలోకి మిశ్రాగారని మరో ఆయన వచ్చారనీ తెలిసింది. సుబ్రహ్మణ్యం మాత్రం ఆ ఇంట్లోనే వున్నాడని చెప్పారు. సాయంత్రం బయలుదేరి బజారు పన్లన్నీ చూసుకుని రాత్రి ఎనిమిది గంటలు అవుతూండగా సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్ళాడు ముకుందం. దానాల కోసమనో మరొకందుకో సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్తూనే వుంటారు. అందులో తనొకడు.

ఇల్లు అద్దంలావుంది. ఇంటిముందు చక్కగా అలికి వుంది. కాస్త స్థలంలో చుట్టూ కంచె పాతి కూరల పాదులు పెట్టారు. తులసికోట. “సుబ్రహ్మణ్యం” అంటూ పిలిచాడు ‘ఎవరూ’ అంటూ వచ్చింది శారద.

ముకుందాన్ని చూసి మొహం విప్పారగా “రండి రండి” అని ఆహ్వానించింది. ఆయనింకా రాలేదు. మరో అరగంటలో వస్తారు... అంటూ మంచం వాల్చి కూర్చోమంది. కుండలోంచి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. టేబిల్‌ఫాన్ తెచ్చి కాస్త దూరంగా స్టూలుమీద పెట్టింది. శాస్త్రిగారు వెళ్తూ రిపేరులో వుంది. బాగుచేయించుకోండి అని ఇచ్చి వెళ్ళారుట. ఇంకా పాత అద్దం వగైరాలు కూడా ఇచ్చి వెళ్ళారుట. లోపలికిరండి అని తీసుకువెళ్ళింది.

లోపల వస్తువులన్నీ చక్కగా సర్దివున్నాయి. ఓ మూలగా గోడకి కొట్టివున్నాయి దేవుడి ఫోటోలు. వెంకటేశ్వర స్వామి, శివపార్వతులు, ఆంజనేయస్వామి. ఆ పక్కనే పత్నీసమేతంగా రామయ్య మాస్టారి ఫోటో. కొత్త ఫ్రేము మెరుస్తుంది. చమ్కీదండ వేసి వుంది. కుంకుమ బొట్టు ఫోటోమీద మందారపూలు.

తన ఆరాధ్య దైవాలను చూడగానే వినయంగా నమస్కారం చేశాడు ముకుందం. “పెద్దవాళ్ళ ఫోటో కూడా పూజలలో పెట్టుకున్నారు. మంచిపని చేశారు” అన్నాడు. ఏదోలెండి ఇదంతా వాళ్ళ చలవ. అంటూ చేతులెత్తి దణ్ణం పెట్టింది. ఇంటి సామాన్లు చూసి మరోసారి మాస్టారికి దణ్ణం పెట్టుకుని వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

అంతలోనే వచ్చాడు సుబ్రహ్మణ్యం. వెంట గిన్నెల సెట్టులా ముగ్గురు పిల్లలు. అందులో ఒకడు సుబ్రహ్మణ్యం కొడుకు.

ముకుందాన్ని చూసి ఆదరంగా పలకరించాడు సుబ్రహ్మణ్యం. బాగున్నారా అన్నయ్య అంటూ వచ్చి పక్కన కూర్చున్నాడు.

పిల్లలు ముగ్గురూ కాళ్ళు కడుక్కుని మంచినీళ్ళు తాగి పుస్తకాలు ముందువేసుకుని కూర్చున్నారు.

"ఎవరా పిల్లలు? బంధువులు ఎవరైనా వచ్చారా?" అడిగాడు ముకుందం.

"బంధువులు కాదన్నయ్యా పాపం తల్లీ తండ్రి లేరు. వీళ్ళ మేనమామ తీసుకొచ్చి స్టేషను దగ్గర హోటల్లో పనికి పెట్టాడట. చిన్న వెధవలు కదా. పని చెయ్యలేకా వాళ్ళ దండింపులు భరించలేక ఏడుస్తూ నాకంటబడ్డారు. జాలి వేసి నాతో తీసుకొచ్చాను. మేము తినే మెతుకులే వాళ్ళూ తింటారు. ఆ వరండాలో పడుకుంటారు. అన్నాడు సుబ్రహ్మణ్యం.

ముకుందం కళ్ళు చెమర్చాయి. మాస్టారిని మళ్ళీ చూస్తున్నంత ఆనందం కలిగింది.

"వాళ్ళకోసం మేము చేస్తున్నది ఏమిలేదండీ. చిన్న వెధవలు ఎంత తింటారు. తెలిసిన వాళ్ళతో చెప్తే వాళ్ళ పిల్లల పాతబట్టలూ పుస్తకాలు ఇచ్చారు. తీరిక వేళల్లో ఓ ముక్క చెప్తున్నాను. బాబుకి తోడు దొరికింది. నాకూ కాలక్షేపం అవుతుంది. నాకు చేదోడు వాదోడుగానూ వుంటున్నారు." శారద చెప్తూవుంటే అమ్మగారు పునర్జన్మ ఎత్తినట్టు తోచింది.

పెల్లుబికిన ఆనందంతో మనసులోనే ఆ పుణ్యదంపతులకు మనసారా నమస్కరించి వరండాలో కూర్చున్న పసివాళ్ళ బుగ్గలు నిమిరి బయటకు వచ్చిన ముకుందం ఆనందబాష్పాలు తుడుచుకుంటూ సైకిలు ఎక్కాడు.

*1999 కథామహల్ దువ్వూరి శారదాంబ పోటీకథల సంపుటి*